



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

వైఎస్ఆర్ కడప

సోమవారం 15 సెప్టెంబర్ 2025

పేజీలు - 08




# కూలీలకు పైసల్లేవ్..

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్రం నుంచి నిధుల విడుదల ఆలస్యం అవుతుండటంతో పది రోజుల్లో చెల్లించే వేతనాలు ఐదునెలలు గడుస్తున్నా అందలేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు రూ.119 కోట్ల మేర బిల్లులు కేంద్రం నుంచి విడుదల కావలసి ఉంది. అదేవిధంగా మెటీరియల్ వేజెస్ కింద మరో రూ.40 కోట్ల వరకు రావలసి ఉందని తెలుస్తోంది. బిల్లుల చెల్లింపు జాప్యం కారణంగా ఉపాధి కార్మికులు పనులకు ముఖం చాటేస్తున్నారు. కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉపాధి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం**
**పెండింగ్ బిల్లులు రూ.119 కోట్లపైనే..**
**మెటీరియల్ వేజెస్ కింద రూ.40 కోట్లు నిలిపివేసిన కేంద్రం.. ఐదునెలలుగా అందని కూలీ**
**తీవ్ర ఇబ్బందుల్లో కూలీల కుటుంబాలు**

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులో ఇటీవల తీవ్ర జాప్యం జరుగుతోంది. సకాలంలో వేతనాలందక కూలీలు అవస్థలు పడుతున్నారు. వారంనుంచి పది రోజుల్లో చెల్లించే వేతనాలు నాలుగైదు నెలలుగా అందలేదు. కేంద్రం ఎందుకో నిధుల విడుదలను పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ..మిగతా 2వపేజీలో

## ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

వార్త 2వపేజీలో

## నగరంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు

వార్త 8వపేజీలో

దేవాదాయ భూమిలో సమాధి నిర్మాణం...

# చేతులెత్తేసిన అధికారులు

అక్రమ సమాధిని వెంటనే తొలగించాలి

దేవాదాయ శాఖ స్పష్టమైన ప్రకటన చేయాలి

ఆలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని భక్తుల డిమాండ్



చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్ : కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలో ప్రసిద్ది చెందిన చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం ఆవరణంలో భారీగా అక్రమంగా నిర్మించబడిన సమాధి ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని దేవాదాయ శాఖకు చెందిన భూమిలో ఈ నిర్మాణం అక్రమంగా జరిగిందని అధికార నివేదికలు తేల్చినప్పటికీ, ఇప్పటి వరకూ వాస్తవిక చర్యలు తీసుకోవడం లేదు. సంబంధిత అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టి ..మిగతా 2వపేజీలో

రిమ్స్‌ను పరిశీలించిన

# వైసిపి బృందం













# నల్లా పానీకి నరకయాతన



**విద్యుత్ నగర్‌లో నీటి కష్టాలు**

**ఉలుకు పలుకు లేని కార్పొరేషన్ నీటి సరఫరా అధికారులు**

**లబోదిబో మంటున్న మహిళలు**

**కడప రూరల్, మేజర్‌న్యూస్:** వేసవి అసలే కాదు, వర్షాకాలం మొదలయ్యింది వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి.ఎనిమిది కిలోమీటర్లు ఉన్న పెన్నా నది వర్షపు నీటితో నిండుకుండలా ప్రవ హిస్తుంది. 24 గంటలు నగర ప్రజలకు నీటిని సరఫరా చేస్తామన్న ప్రజా ప్రతినిధుల మాటలు నీటి మీద రాతలుగా మారాయి. కార్పొరేషన్ నీటి సరఫరా విభాగం అధికారులు, ప్రజలచే ఎన్నుకోబడ్డ స్థానిక ప్రజా ప్రతినిధి పట్టించుకోకపోవడంతో విద్యుత్ నగర్ ఒక టవ వీధి ప్రజలకు నీటి కష్టాలు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు అవసరాలు తీర్చుకునేందుకు అవసరమయ్యే నీరు పది రోజులుగా సరఫరా కాకపోవడంతో మహిళలు బిందెలు చేతబట్టి నీటి కోసం పరుగులు తీస్తున్నారు. ఇంట్లో కుల్లాయిలకు నీరు రాక పోయా, శుద్ధి జలాన్ని కొనుగోలు చేసి అవసరాలను తీర్చుకోగలమని ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు నీటి సరఫరా పై కార్పొరేషన్ సిబ్బందికి తెలియ పరచాలని ప్రయత్నించిన కులుకు పలుకు లేదని పలువురి నుండి వస్తున్నాయి. లింగంపల్లి వాటర్ వర్క్స్ నుండి నగరానికి నీరు సరఫరా అయ్యే పైప్లైన్ అతి సమీపంలో ఉన్నప్పటికీ ఎందుకు నీరు అందివ్వడం లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మహిళలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు అందించే విధంగా చర్యలు తీసుకొని, నీటి సరఫరా పై అతి నిర్లక్ష్యం గా విధులు నిర్వహి స్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**నీటి కోసం తిప్పలు:**



అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందని ఇక్కడ అద్దెకు చేరాం. పది రోజుల నుండి నీళ్లు రావడం లేదు. ఎక్కడ నీరు వస్తుందో అక్కడికి బిందెలతో వెళ్లి తెచ్చుకోవాల్సిన తిప్పలు తప్పడం లేదు. పది రోజుల నుండి సమస్యతో అల్లాడుతున్న పట్టిం చుకునే నాధుడే లేదు.

**- వి సుబ్బయ్య**

**మహిళల గోడు తగులుతుంది:**



వయస్సు పైబడింది, పది రోజుల నుండి నీళ్లు రాక కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఎక్కడో నీళ్లు వస్తుంటే అక్కడికి వెళ్లి బిందెలతో తెచ్చుకొనే శక్తి లేదు. ఉండాలా, ఎక్కడి కన్నా వెళ్లాలా అన్న విధంగా ఉంది.. ఓట్ల కోసం వస్తారు, గెలిచినాక పట్టించుకోరు. నీళ్లు కొని ఎన్నాళ్లు స్నానాలు చేస్తాం. మహిళల గోడు తగులుతుంది.

**- రత్నమ్మ**

# కూలీలకు పైసల్లేవ్!

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కూలీలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.1,878 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కడప జిల్లాకు కూడా కేంద్రం నుంచి రూ.119 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా మెటీరియల్ వేజెస్ కింద కూడా మరో రూ.40 కోట్ల వరకు అందాల్సి ఉంది. ఈ నిధులు విడుదల కాకపోవడతో నాలుగు నెలలుగా కూలీలకు ఉపాధి బిల్లులు నిలిపివేశారు. కడప జిల్లాలోని 35 మండలాల్లోని ఐదు క్లస్టర్లలో 2,30,030 జాబ్‌కార్డులు జారీ చేశారు. 4,21,166 మంది కార్మికులు ఉపాధి కోసం నమోదు చేయించుకున్నారు. ఇందులో 1,88,923 కుటుంబాలు యాక్టివ్‌గా ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 45లక్షల పనిదినాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. రూ.138.15 కోట్లు ఉపాధి కూలీలకు, రూ.92.10 కోట్లు మెటీరియల్ వేజెస్ కింద ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అంటే మొత్తం రూ.230.25 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు నివేదికల్లో పొందుపరిచారు. కూలీలు రోజు వారి సరాసరి వేతనంగా రూ.272 పొందుతున్నారు. గత నెల వరకు 2,714 కుటుంబాలు 100 రోజుల పనిదినాలు కూడా పూర్తి చేసుకున్నాయి. అంతా బాగుంది. కానీ కేంద్రం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో కూలీలకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాల నుంచి కూలీ మొత్తాలు కూలీల ఖాతాల్లో జమ కావడం లేదని తెలుస్తోంది. దీంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాకు సంబంధించి లేబర్ వేజెస్ కింద రూ.71 కోట్లు, మెటీరియల్ వేజెస్ కింద రూ.25 కోట్లు వెరసి రూ.96 కోట్లు చెల్లింపులు ఫిబ్రవరి మొదటి వారంలోనే నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా జిల్లాలోని చాలా మండలాల్లో ఉపాధి కూలీల హాజరులో అంతంత మాత్రంగానే కొనసాగుతూ వచ్చింది. అధికారులు ఈ విషయాన్ని గుట్టుగా ఉంచుతూ వచ్చారు. ప్రస్తుతం బకాయిలు రూ.119 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. మెటీరియల్ వేజెస్ కింద రూ.40 కోట్ల వరకు అందాల్సి ఉంది. ఈ నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో అంతు చిక్కడం లేదు. అధికారులు ఇవ్వాలా.. రేపు అంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీల కుటుంబాల్లో ఆలజడి నెలకొంది. ఐదు నెలలుగా తాము చేసిన పనికి కూలీ డబ్బులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# దేవాదాయ భూమిలో సమాధి నిర్మాణం.. చేతులెత్తేసిన అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకోవడం, గ్రామ స్థలలో గుబులు రేపుతోంది.

**40-50 లక్షల వ్యయంతో అక్రమ నిర్మాణం**

వేంపల్లి ప్రాంతానికి చెందిన రామలింగారెడ్డి అనే వ్యక్తి తన మృత కుమారునికి గంగమ్మ ఆశీస్సులే కారణమన్న నమ్మకంతో గుడి ఆవరణలోనే సమాధి ఏర్పాటు చేశాడు. దీనిని గుడిలా తీర్చిదిద్దేందుకు రూ. 40 నుంచి 50 లక్షల వరకు ఖర్చు చేశాడు. ఇది పూర్తిగా దేవాదాయ శాఖ భూమిలో జరిగినా, అప్పట్లో ఈ.వో. కార్యాలయం పట్టించుకోకపోవడం ఇప్పుడు ప్రశ్నల పరంపరకు దారితీస్తోంది.

**సర్వేలో భూమి దేవాదాయ శాఖదే అని స్పష్టత**

ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూదళాలు, అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో సర్వే జరిపాయి. సర్వేలో సమాధి నిర్మించిన భూమి ఆలయానికి చెందినదే అని స్పష్టమైంది. అయినప్పటికీ అక్రమ నిర్మాణాన్ని కూల్చే చర్యలు ఇప్పటివరకు తక్కువ స్థాయిలోనే మిగిలిపోయాయి. అధికారులు నోటీసులు ఇచ్చినట్టు చెబుతున్నారు కానీ వాస్తవంగా ఏమీ జరిగినట్టు కనిపించడం లేదు.

**ఈ.వో. - అసిస్టెంట్ కమిషనర్ మధ్య జవాబుదారిత్వ దోబూచులాట**

ఈ వివాదంపై పత్రికా విలేఖరి ఆలయ ఈ.వో.ను ప్రశ్నించగా, "ఇది అసిస్టెంట్ కమిషనర్ పరిధిలోకి వస్తుంది" అంటూ సమాధానం దాటవేశారు. అదే ప్రశ్నను అసిస్టెంట్ కమిషనర్‌కి వేస్తే, "ఆలయ భూమికి సంబందించి నిర్ణయం తీసుకోవాల్సింది ఈ.వో.వారు" అని చెప్పారు. అధికారుల మాటల్లో వచ్చిన విరుద్ధత, బాధ్యత గలవారి మధ్య స్పష్టత లేకపోవడం, అసలు సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోంది.

**భక్తులు ఆరోపణలు - ముడుపుల ప్రభావమా?**



స్థానికంగా పలువురు భక్తులు చెబుతున్న ప్రకారం, ఆర్థికంగా బలమైన రామలింగారెడ్డి అధికారులకు ముడుపులు అందించి అక్రమ నిర్మాణాన్ని నిలబెట్టారని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇదే కారణంగా ఇప్పటి వరకూ నిర్మాణం తొలగించకుండా వదిలేశారని అంటున్నారు. పేదల గుడిసెలు పగలగొట్టే అధికారులే ఇక్కడ మాత్రం మౌనంగా ఉండడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

**దేవాలయ భూముల పరిరక్షణపై డబుల్ స్టాండర్డ్స్?**

ఇటువంటి చర్యలతో దేవాలయాల భూములు దుర్వినియోగం అవుతున్నాయనే ప్రజాభిప్రాయం బలపడుతోంది. దేవాదాయ శాఖ బాధ్యతగా వ్యవహరించకపోతే, భవిష్యత్‌లో మరిన్ని ఇలాంటి అక్రమాలు ఊహించాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం చూస్తూ ఉండే వ్యవస్థ కాకుండా, ప్రజల విశ్వాసాలను నిలబెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# రాంగోపాల్ రెడ్డికి ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రైవేటీకరణ పై పోరాటం చేయాలి

**రాంగోపాల్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను ఖండించిన వైసీపీ నేతలు**



**పులివెందుల మేజర్‌న్యూస్:** ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి పులివెందుల వాసిగా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రైవేటీకరణ పై పోరాటం చేయాలని,పులివెందుల వైద్య కళాశాలపై రామగోపాల్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను వైసీపీ నేతలు ఖండించారు. ఈ సందర్భంగా పులివెందులలోని మెడికల్ కళాశాల వద్ద వైసీపీ నాయకులు మాట్లాడుతూ మీరు చెప్పినట్లు కేవలం రంగులు వేసిన భవనానికి భారత జాతీయ వైద్య కమిషన్ 50 సీట్లు ఎలా మంజూ రు చేసింది, వైద్య విద్య విషయంలో భారత జాతీయ వైద్యకమీషన్ కంటే రామగోపాల్ రెడ్డి కిఉన్న శాస్త్రీయత ఏమిటి, జాతీయ వైద్య కమిషన్ ను అగౌరవ పరిచిన రామగోపాల్ రెడ్డి వెంటనే భారత జాతికి క్షమాపణలు చెప్పాలి, పులివెందుల ప్రజల ఆకాంక్ష ను నెరవేర్చే మెడికల్ కళాశాల ల విషయం లో కళ్లు ఉండి కూడా చూడలేని దుస్థితి కూటమి నేతలకు నెలకొందని, పేద ప్రజల విద్యార్థుల కోసం, జగన్ మోహన్ రెడ్డి నిర్మించిన కళాశాల తో ఎక్కడ జగన్ మోహన్ రెడ్డికి మంచి పేరు వస్తోందో అని చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదని, ఇకనైనా పీ 3 విధానానికి స్వస్తి చెప్పి చంద్రబాబు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని లేకపోతే వైసీపీ ఆధ్వర్యం లో ప్రజల తరుపున పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర నూర్ బాషా సంఘం మాజీ చైర్మన్ రసూల్, మునిసిపల్ వైస్ చైర్మెన్ హాఫిజుల్లా, కౌన్సిలర్‌లు రాజశేఖర్ రెడ్డి, మల్లికార్జున, ఖాదర్ భాషా, ఎస్టీ నాయకులు చెన్నకేశవులు, బిసి నాయకులు కొండయ్య, ఈశ్వరయ్య వైసీపీ యూత్ జహీర్, ప్రశాంత్, విష్ణు, చిన్న, నజీర్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు

# ఉచిత వైద్య శిబిరం




**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండలం రాజా సాహెబ్ పేటలోని కొత్త తిరువెంగళాపురం, కొత్త వెంకటాపురం గ్రామాలలో ఆదివారం నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యం క్లినిక్ డాక్టర్ సుజిత్ కుమార్ బిఏఎంఎస్. ఆధ్వర్యంలో దాదాపు 300 మందికి వైద్య శిబిరం ద్వారా అన్ని రకాల జబ్బులకు (బీపీ షుగర్ తదితర రోగాలు) వైద్యం చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగినది. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అన్ని రకాల జబ్బులకు ప్రతివారం రోజు ఒక గ్రామంలో ఏర్పాటు చేసి జబ్బులకు గురికాకుండా వైద్యం చేయడం జరుగుతుందని డాక్టర్ సుజిత్ కుమార్ తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యం క్లినిక్ ద్వారా జబ్బులకు సంబంధించిన వైద్యం కొరకు సంప్రదించాలని ఆయన కోరారు.

# విశ్వనాథ రెడ్డికి మాతృ వియోగం

**టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శ**



చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్: వైయస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మరియు నీటి సంఘం చైర్మ న్ వర్దిరెడ్డి విశ్వ నాథరెడ్డి తల్లి వర్దిరెడ్డి అచ్చమ్మ కాలం చెందింది అని తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి అచ్చ మ్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి టీడీపీ పార్టీ పరంగా సంపూర్ణ మద్దతు ఉంటుం దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్:** ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పెదన పాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిలంకూరు గంగ మ్మ (25) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరాంజనేయులు లక్ష్మీదేవి కుమార్తె గంగ మ్మ. గంగమ్మకు పెళ్లి సంబంధాలు చూస్తుండగా పెళ్లిసంబంధాలు కుదరలేదు. అంతేకాక ఆమె పనిచేస్తున్న క్రమంలో భాగంగా గంగమ్మకు ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి చనువు ఏర్పడిందన్నారు. మృతురాలి తల్లి లక్ష్మీదేవి అనుమానంతో ఫిర్యాదు చేయడంతో ఆమె తెలిపిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**- ఎరువుల ధరలు, యూరియా కొరత నివారించాలి**
**- ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి**



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువుల ధరలు తగ్గించాలని, యూరియా కొరత లేకుండా నివారించాలని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల గోడును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిర్చి, పొగాకు, మామిడి, అరటి, చీని, టమోటా, ఉల్లి తదితర ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నట్లు వెల్లడించారు. పత్తికొండ మార్కెట్లో టమోటా ధర కిలో రూ.1 పలకడం అత్యంత దురదృష్టకరం అన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, నాయకులు సుబ్బారెడ్డి, అమర్, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## బిసి సబ్బిటీ రుణాలు మంజూరు చేయాలి

**లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం**



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** విలేకరుల సమా వేశంలో మాట్లాడుతున్న జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున జాతీయ చేతి వృత్తులఐక్య వేదిక పార్టీ,బి సి యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహి ంచామని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్సిడీ రుణాల నోటిఫికేషన్ విడుదలు చేసింది.గడిగిన 3 నెలలుగా రుణాలకు సబ్సిడీ వెయలేదని మండిపడ్డారు బి సి లు ఉపాధికోసం పెట్టుకున్న రుణాలకు సబ్సిడీ వెయ్యడంలో ఉడుకు, పలుకు లేకుండా ఉండడం దుర్మార్గమైన చర్య, వెంటనే కుటమి ప్రభుత్వం రుణాలకు సబ్సిడీ మంజూరు చేసి బి సి వారికి సహాయం అందించాలని కోరారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమం చేపడతామని ప్రజా ప్రతినిధులలో అడ్డుకుంటామని హెచ్చరించారు

## సింహాద్రిపురం పాఠశాల హిందీ ఉపాధ్యాయునికి సన్మానం




**సింహాద్రిపురం మేజర్‌న్యూస్ :** కడపలో హిందీ దినోత్సవం వేడుకలు సింహాద్రిపురం పాఠశాల హిందీ ఉపాధ్యాయునికి సన్మానం నిర్వహించడం జరిగింది.కడప పట్టణంలోని సి.పి. బ్రౌన్ గ్రంథాలయంలో రాష్ట్రియ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ బోధనలో విశేష కృషి చేసి, విద్యార్థులను ఉత్తమ ఫలితాలకు దారితీసిన హిందీ ఉపాధ్యాయుడు శ్రీ జయప్రకాష్ రెడ్డి నీ సత్కరించారు. ఆయన విద్యార్థులలో హిందీ పట్ల ఆసక్తిని పెంపొందించి, భాషా ప్రాముఖ్యతను తెలియజేస్తూ చేసిన కృషిని సభలో ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ హిందీ భాష భారతదేశ జాతీయ సమైక్యతకు ప్రతీక అని, ప్రతి విద్యార్థి హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా భాషా ఐక్యతకు తోడ్పడాలని సూచించారు. విద్యార్థుల విద్యా పురోగతిలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం అని, ఇలాంటి సన్మానాలు మరింత ప్రేరణ కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రియ ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రతినిధులు, విద్యా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుష్పగిరిలో.. అరుదైన కాలభైరవుని కుడ్య శిల్పం

**పద్మాధారిక శివద్వారపాలకునిగా భైరవుని ప్రాచీన శిల్పం - త్రినేత్ర భైరవుడు అర్ధస్వస్తికాసనంలో 13వ శతాబ్దపు శిల్పకళకు జీవం**
**- ఇప్పటివరకు వెలుగు చూడని ద్వారపాలక శిల్పం రచయిత రమేష్**

**వల్లూరు మేజర్‌న్యూస్ :** మండల పరిధిలో ఉన్న ప్రసిద్ధ దక్షిణ కాశీ పంచనదీ క్షేత్రం పుష్పగిరి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని శివపాదాలయ ముఖద్వారంపై వెలుగు చూసిన అరుదైన కాలభైరవుని కుడ్య శిల్పం చరిత్ర శిల్ప కళాభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది, ఈ ద్వారపాలక శిల్పంలో కాలభైరవుడు పద్మాధారిక శివద్వారపాలకునిగా చిత్రీకరించబడి ఉండటం విశేషమని చరిత్రకారుడు రచయిత బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు, ఇది ఇప్పటివరకు వెలుగు చూడని శిల్పంగా, శివద్వారపాలకుల్లో అరుదైన రూపంగా భావించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు, భైరవుడు శివుని అత్యంత భయానక రూపంగా పౌరాణిక గ్రంథాల్లో పేర్కొనబడ్డాడు, అయినప్పటికీ ఆయన భక్తులకు రక్షకుడిగా, కాలానికి అధిపతిగా విస్తృతంగా ఆరాధించబడుతున్నాడు అని ఆయన వాహనం శునకం కాగా, ఆయుధాలుగా త్రిశూలం, ఖడ్గం, కపాలం, వజ్రం, పాము, పిన్నాక విల్లు మొదలైనవి కలిగి ఉంటాడని రమేష్ వివరించారు, త్రినేత్రంతో, కిరీటధారిగా, నాగాభరణాలతో, పులిచర్మ ధారణతో ఉండే భైరవుని రూపం ఈ శిల్పంలో కనిపిస్తోందని తెలిపారు, ఈ అరుదైన కుడ్య శిల్పంలో భైరవుడు కుడిచేతి పైభాగంలో పద్మం, క్రిందగల చేతిలో గదను, ఎడమ పై చేతిలో సర్పాన్ని, మరో చేతిని కటిహస్తంగా చూపడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు, శిల్పం అర్ధస్వస్తికాసన భంగిమలో ఉండి, కళాత్మకంగా ఎంతో మనోహరంగా చెక్కబడి ఉందన్నారు, ఈ శిల్పం సుమారు 13వ శతాబ్దానికి చెందినదిగా ప్రముఖ వాస్తు శిల్ప వాచస్పతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారని అన్నారు, శిల్పకళలో భైరవుని పద్మధారకుడిగా చూపిన రూపం అత్యంత అరుదైనదని అభిప్రాయపడ్డారు, ఇది శైవ పరంపరలో ద్వారపాలక శిల్పాలలో ఓ ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుందని ఆయన తెలిపారు..





## ఎంపీజే రాయలసీమ ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయాలి




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ఎంపీజే రాయలసీమ ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయాలనిలఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దు రజాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇంచార్జి ఆయూబ్ ఖాన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపీజె ఆఫీసులో ఎంపీజే రాయలసీమ ప్రాంతీయ మహాసభ పోస్టర్స్ ను వారు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు అక్టోబర్ 11న జరిగే ప్రాంతీయ మహాసభకు ఎంపీజే సభ్యులు, శ్రేయోభిలాషులు, ఎంపీజే ను బలపరిచే నాయకులు స్త్రీ, పురుషులు, రాజ్యాంగ ప్రేమికులు, కుల మతాలకు అతీతంగా అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాష, కార్యదర్శి రఫీ, ఇస్మాయిల్, ముక్తియార్, గౌస్ లాజం, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాష దినోత్సవం

**- వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు**




**వేంపల్లె మేజర్‌న్యూస్ :** స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆ పాఠశాల హెచ్‌ఎం శివమునెమ్మ ఆధ్వర్యంలో హిందీ భాషోపాధ్యాయులకు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ 1949, సెప్టెంబర్ 14న హిందీ భాష అధికార భాష గా గుర్తింపు పొందినట్లు వెల్లడించారు. దేవ నాగరి లిపిగా దీనికి పేరుందని, దేశంలో ఎక్కువ మంది మాట్లాడేది హిందీ భాష అని తెలిపారు. మాతృభాషలో చక్కగా రాణించే విద్యార్థి ఇతర భాషలను సులభంగా అధ్యయనం చేయగలరని చెప్పారు. అలాగే హిందీ భాషోపాధ్యాయులు లత, పర్వీన్, వసంత కుమారి లు హిందీ భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లి త్రిశూల ప్రతిష్ట లో కూటమి నాయకులు విశేష పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపాలిటీలోని మిసమ్మ బంగ్లా వద్ద పోలేరమ్మ తల్లి త్రిశూల ప్రతిష్ట ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమ్మవారికి తుంగభద్ర ప్రోజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి వెంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదాలతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శ్రేయస్సు కలగాలని కోరుకుంటున్నాం. ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో పాల్గొనడం మా అదృష్టం.” అని అన్నారు.వెంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి పూజలతో పులివెందుల పట్టణానికి శాంతి, సంపదలు కలగాలని మనసారా కోరుకుంటున్నాం. ఇలాంటి ధార్మిక వేడుకలు సమాజాన్ని ఒకతాటిపైకి తెస్తాయి.” అని తెలిపారు.పట్టణ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజల్లో పాల్గొనడం ఎంతో సంతోషకరం. ఈ వేడుకల ద్వారా యువతలోనూ ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుంది.” అని అన్నారు.అలాగే హిందూ జె ఏ సి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఉపేంద్ర రెడ్డి, లక్ష్మయ్య తదితరులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ప్రజల కోసం మరిన్ని మేలుచేసే విధంగా నడిపించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

ఆర్ ఎస్ పి రాష్ట్ర కార్యకదర్శి జానకి రాములు. - కేంద్ర బడ్జెట్ లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి.

పి ఎస్ యు జాతీయ అధ్యక్షులు మహమ్మద్ షఫిఉల్లా






కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర ఆర్థిక బడ్జెట్ లో విద్యారంగానికి 20 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.కడప నగరంలోని ఒక మీటింగ్ హాలునందు పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పొలిటికల్ ట్రైనింగ్ క్యాంప్ జరిగింది. ఈ ట్రాయినింగ్ క్యాంప్ ను ఉద్దేశించి మహమ్మద్ షఫిఉల్లా ఆర్ ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో డిజిటల్ విద్యను అందించాలని గొప్పలు చెప్పడం కాదు అందుకు తగినవిధంగా కేంద్రం 20శాతం రాష్ట్రం 30 శాతం బడ్జెట్లు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేసారు. దేశాన్ని పలిస్తున్న రాజకీయా నాయకులలో అత్యధిక శాతం నేర చరిత్ర, అవినీతి పాల్పడిన వారు వున్నారని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నం చేయడం అన్యాయం అని అన్నారు.వన్ నేషన్ వన్ బాషా గా అందరికి హిందిని రుద్ది మాతృభాషలను కాలరతున్నారని అన్నారు. కాబట్టి దేశంలో అవినీతి పోవాలన్నా రాజ్యాంగాన్ని కాపాడాలన్న నేడు యువత రాజకీయాల్లోకో రావాలని పేర్కొన్నారు. పి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయడం ఆపాలని కోరారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా వున్నా ఉద్యోగాలకు ఎప్పటికి అప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలనీ డిమాండ్ చేసారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయడానికి పి ఎస్ యు ముందుటుందని తెలియరు.

## దువ్వూరు మండలానికి 32 టన్నుల యూరియా

నేడు యూరియా పంపిణీ - వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి



దువ్వూరు, మేజర్‌న్యూస్ : దువ్వూరు మండలానికి 32 టన్నుల యూరియా చేరిందని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డిఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి 32 టన్నుల యూరియా మంజూరైన యూరియాను దువ్వూరు 1,2 రైతు సేవా కేంద్రాలలో, అలాగే చింతకుంట 2 రైతు సేవ కేంద్రం, దువ్వూరులోని కాశిరెడ్డి నాయన ట్రేడర్స్ లలో నేడు యూరియా పంపిణీ చేయబడును అని అయన తెలిపారు. ఈ యూరియా నుసోమవారం ఉదయం 9 గంటల నుండి ఆయా గ్రామాల్లో ఉండే రైతులకు మాత్రమే పంపిణీ చేయబడుతుందని తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం దగ్గరికి ఆధార్ కార్డు, భూమి పాసుబుక్ తప్పకుండా తీసుకెళ్లవలెను అని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలియజేశారు

## చూపర్లను ఆకర్షిస్తున్న మునక్కాయలు




కడప క్రైమ్ మేజర్‌న్యూస్ : సాధారణంగా మునగ చెట్టుకు రెండు అడుగుల నుంచి మూడు అడుగుల వరకు మునక్కాయ కాయడం చూసాము, కానీ ఈ చిత్రంలో మీరు చూస్తున్నది ఐదు అడుగుల మున క్కాయ కాశీ అందరూ చూపులను ఆకర్షిస్తుంది, స్థానిక కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీ లో నివాసం ఉంటున్న వేణుగోపాల్ ఇంటి పెరటిలో మునగ చెట్టు పెంచడం జరిగింది, ఈ చెట్టుకు పశువుల ఎరువుతో పాటు రసాయనిక ఎరువులు వేయడంతో చెట్టు ఏపు గా పెరిగి ఆశ్చర్యంగా చెట్టుకు గుత్తులుగా మున క్కాయలు ఐదు అడుగులు వరకు పెరగడంతో వీధిలో వచ్చి పోయే వారందరూ విశేషంగా చూడడం జరుగుతుంది,

## మన శరీరానికి అసలు ఏయే పోషకాలు కావాలి!



దువ్వూరు, మేజర్ న్యూస్ : మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని అందరికీ తెలిసిందే. అయితే పోషకాలు అంటే.. సాధారణంగా చాలా మంది విటమిన్లు, మినరల్స్ మాత్రమేననుకుంటారు. కానీ అది పొరపాటు. ఎందుకంటే పోషకాలు రెండు రకాలు. అవి 1, స్థూల పోషకాలు. 2, సూక్ష్మ పోషకాలు. వీటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం. కార్బొహైడ్రేట్లు (పిండి పదార్థాలు), ప్రోటీన్లు (మాంసకృత్తులు), ఫ్యాట్స్ (కొవ్వులు).. ఈ మూడింటినీ స్థూల పోషకాలు " అని అంటారు. ఎందుకంటే ఇవి నిత్యం మన శరీరానికి పెద్ద మొత్తంలో అవసరం అవుతాయి. అందుకనే వీటిని స్థూలపోషకాలు అంటారు. ఇక వీటిలో కార్బొహైడ్రేట్ల వల్ల మనకు శక్తి లభిస్తుంది. నిత్యం మనం యాక్టివ్గా పనిచేసేందుకు కావల్సిన శక్తి మనకు వీటివల్లే లభిస్తుంది. అలాగే ప్రోటీన్ల వల్ల మన శరీరంలో కండరాలు నిర్మాణమవుతాయి. పాత కణజాలం పోయి ఆ కొత్త కణజాలం ఏర్పడుతుంది. శరీర నిర్మాణం జరుగుతుంది. ఇక కొవ్వులతో మన శరీరం భవిష్యత్ శక్తి అవసరాలకు కావల్సిన ఆహారాన్ని నిల్వ చేసుకుంటుంది. అలాగే పలు విటమిన్లు, మినరల్ను మన శరీరం సరిగ్గా ఆ శోషించుకునేందుకు కూడా కొవ్వులు పనికొస్తాయి. మన శరీరానికి అవసరమైన బి విటమిన్లు, మినరల్లు సూక్ష్మ పోషకాలు అంటారు. ఇవి నిత్యం మనకు చాలా తక్కువ మోతాదులో అవసరం అవుతాయి. అందుకనే వీటిని సూక్ష్మ పోషకాలు అంటారు. వీటిల్లో అనేక రకాలు ఉంటాయి. విటమిన్ ఎ, బి1 (థయామిన్), బి2 (రైబోఫ్లేవిన్), బి3 (నియాసిన్), బి5 (పాంటోథెనిక్యాసిడ్), బి6 (పైరిడాక్సిన్), బి7 (బయోటిన్), బి9 (ఫోలేట్), బి12 (సయానో కోబాలమిన్), విటమిన్ సి (ఆస్కార్బిక్ యాసిడ్), విటమిన్ డి (డి3), ఇ, కె, కె2లు విటమిన్ల జాబితాలోకి వస్తాయి. అలాగే కాల్షియం, పాస్ఫరస్, మెగ్నిషియం, సోడియం, క్లోరైడ్, పొటాషియం, సల్ఫర్, ఐరన్, మాంగనీస్, కాపర్, జింక్, అయోడిన్, ఫ్లోరైడ్, సెలీనియం తదితర పదార్థాలను మినరల్స్ అంటారు. మనకు విటమిన్లు, మినరల్స్ నిత్యం అవసరం అవుతాయి. అయితే ఆడ, మగ, పిల్లా పెద్దా వయస్సును బట్టి ఆయా విటమిన్లు, మినరల్స్ ను నిత్యం మనం తీసుకోవాల్సిన మోతాదులు మారుతుంటాయి. ఈ క్రమంలో ఎవరైనా సరే.. నిత్యం తమ ఆహారంలో అన్ని స్థూల పోషకాలు, అన్ని సూక్ష్మ పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఆయా పోషకాలు ఉండే ఆహారాలను నిత్యం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.

## టిడిపి తీర్థం పుచ్చుకున్న పెన్నా నగర్ ముస్లిం సోదరులు



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ : మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పెన్నా నగర్ కు చెందిన 50 మైనారిటీ కుటుంబాలు ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మండల పరిధిలోని సోములవారి పల్లె గ్రామ పంచాయతీ పెన్నానగర్ మైనారిటీ నాయకులు సయ్యద్ గండికోట నూర్ భాష, సయ్యద్ జమాల్ భాష, సయ్యద్ ఖాజా హుస్సేన్, సయ్యద్ రఫీ, సయ్యద్ జాఫర్, అల్లా బకాష్, నూరుల్లా, గౌసులాజమ్, సయ్యద్ కరీముల్లా, సయ్యద్ సిద్దిక్, సయ్యద్ రహూల్, సయ్యద్ అమీర్, సయ్యద్ అలి తదితరులు వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరిన మైనారిటీ నాయకులు సయ్యద్ నూర్ భాష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంద్యాల వరప్రసాద్ రెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీబుల్లా, కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, మున్నా, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, బేపారి గౌస్ బాషా, నూరి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి పెన్నా నగర్ నాయకులు షామీర్, షరీఫ్, ఆటో బాషా, షరీఫ్ (కవి), ఖాసిం, ఆటో సుధాకర్, కులాయప్ప, సుబ్బరాయుడు, పెద్ద బి, నరసింహ, పాములేటి, సుబ్బయ్య పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘం పిఆర్సీని వెంటనే నియమించాలి



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘం పిఆర్సీని వెంటనే నియమించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి కోరారు. ఆదివారం ఈ విషయమై స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన స్థానిక ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి 12వ వేతన సవరణ సంఘం పిఆర్సీని వెంటనే నియమించాలని, పెండింగ్ లో వున్న నాలుగు విడతల డిఎలను వెంటనే ప్రకటించాలని,30 శాతము మధ్యంతర భృతిని చెల్లించాలని, అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపియస్ విధానాన్ని రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని, మెమో 57 ప్రకారం 2003 డియస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని, టీచర్లను బోధనేతర పనులనుంచి మినహాయించాలని కోరారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని వినతిపత్రం సమర్పించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకొని పోయి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాజుపాలెం మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహకుమార్, రామదస్తగిరి రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, జాన్ సురేష్, నారాయణరెడ్డి, రమణారెడ్డి, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తీరేదెన్నడో..?

## సమావేశాలకే పరిమితమవుతున్న ప్రజా సమస్యలు

## ఈ సమావేశంలోనైనా పరిష్కారం దొరికేనా

**చెన్నూరు మేజర్‌న్యూస్ :** మండలంలోని పలు సమస్యలు సంవత్సరాల నుండి పరిష్కారం కాక కేవలం మండల సమావేశాలకే పరిమిత ముఫుంటున్నాయని మండల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.మండల ప్రజల ప్రధాన సమస్య అయినా కడప కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డుకు ఇరువైపులా బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టికపోవడంతో వర్ష కాలం, వేసవి కాలంలో ప్రయాణికుల అవస్థలు వర్ణాతితం,అలాగే అప్రోచ్ రోడ్ల,డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడం వర్షాకాలంలో జాతీయ రహదారి పై నీరు నిలిచి చెరువును తలపిస్తోంది.అలాగే పేదలకు మంచి వైద్య సేవలు అందించాలని గత ప్రభుత్వంలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణాలు చేపట్టిన సామాజిక ఆరోగ్య కేంద్రం కొన్ని పనులు మినహా దాదాపు పూర్తి అయినా కూడా ఆసుపత్రిని ప్రజలు వినియోగించకుండా నిరూపయోగంగా దర్శనమిస్తోందని ఆసుపత్రి నూతన ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి రావడానికి ఇంకెన్ని నెలలు పడుతుందో అని రోగులు చర్చించుకుంటున్నారు. సిహెచ్సిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మంగళవారం జరిగే సమావేశంలోనైనా జవాబు దొరుకుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.అలాగే చెన్నూరు,కొండపేట మీదుగా బస్సు నడిపేందుకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి కొండపేట వంతెన వరకు రోడ్డు విస్తరణలో భాగంగా మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చి నెలలు గడుస్తున్న సమస్యను మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయింది.ప్రతి మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యేతో సహా మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావడం వారు చెప్పే ప్రగతి నివేదికలు చదవడం, గ్రామాల ప్రజాప్రతినిధులు సమస్యల చిట్టాలు వినడం వెళ్లిపోవడం తప్ప,అవి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వ సభ్య సమావేశంలోనైనా తీర్చేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటున్నరా అనే సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.మండల సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు జరగడం అంటే అవి తూచ తప్పకుండా వచ్చే సమావేశానికి తీర్చడానికి ప్రయత్నాల షరతు లాంటిది.ఆ దిశగా అధికారులు అడుగులు వేయక ప్రతి సమావేశం సమస్యల చర్చలకే పరిమితం అవుతుందని అనుకుంటున్నారు.గత సమావేశంలోపు కొత్త రోడ్డు పై రోడ్డుకు ఇరువైపులా బస్సు షెల్టర్లు నిర్మాణం,అప్రోచ్ రోడ్ల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ కోసం పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని సభ ముఖంగా తెలిపారు.ఈ సమావేశంలోనైనా హైవే అధికారులు మరో వాయిదా వేసుకోకుండా పనులు మొదలుపెట్టి పూర్తి చేసేటట్లు చూసి ప్రయాణికుల సౌకర్యానికి తోడ్పడుతారని ప్రజలు ఆశపడుతున్నారు.దీంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి కొండపేట బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు చేసే ప్రక్రియ ప్రారంభానికి శ్రీకారం చుడతారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు గత రెండు మండల సమావేశ సమస్యలలో జరిగిన తీర్మానాలను పూర్తి చేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేను మండల అధికారులను అలాగే ప్రజా ప్రతినిధులను మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# చాపాడు జిల్లా పరిస్థిత్ హైస్కూల్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చాపాడు మేజర్‌న్యూస్ :** చాపాడు మండల కేంద్రము లోని గూడూరు అప్పయ్య గారి సుబ్బారాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆదివారం 1998 -99 బ్యాచ్ కు చెందిన 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు రామ మునిరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, శివశంకర్ రెడ్డి, బాబ్జిలతో ఇంకా పలువురు ఉపాధ్యాయులకు విద్యార్థులంతా శాలువా పుష్పలతో పాధాభిషేఖం చేశారు.అనంతరం విద్యార్థులంతా గురువులతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు చదువుకున్న సమయంలో ఉపాధ్యాయుల బోధన, చదువుకున్న తీరు, ప్రస్తుతం విద్యార్థులు స్థిరపడిన జీవిత విధానాలను తెలియజేసుకున్నారు. భార్యాభర్తలు, పిల్లలతో కలసి పూర్వపు విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుపుకోవడం ఆనందంగా ఉందని అప్పటి విద్యార్థులు రామాంజనేయరెడ్డి, చాపాడు రవి, శివశంకర్, చిన్న వీరయ్య ఇంకా పలువు విద్యార్థులు తెలియజేశారు.

# అన్న ప్రసాదం వడ్డించిన జడ్పిటిసి మా రెడ్డి లతా





**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపాలిటీ లోని మిసమ్మ బంగ్లా వద్ద పోలేరమ్మ తల్లి త్రిశూల ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదం జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి చేతుల మీదుగా వడ్డించారు.పులివెందుల మున్సిపాలిటీలోని మిసమ్మ బంగ్లా వద్ద పోలేరమ్మ తల్లి త్రిశూల ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి అమ్మవారిని దర్శించుకొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫైడ్ డైరెక్టర్ ,కడపజిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ,బీజేపీ సీనియర్ నేత వంగల శశిభూషణ్ రెడ్డి, బీజేపీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, హిందూ జె ఏ సి సభ్యులు, గజేంద్ర నాథ్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రొద్దుటూరును జిల్లా కేంద్రం చేసుకోవాలి - జేఏసీ నాయకులు

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** చారిత్రక ప్రాశస్త్యం కలిగిన, జిల్లా కేంద్రానికి వుండాల్సిన అన్ని సౌక ర్యాలు, సదుపాయాలు కలిగిన ప్రొద్దుటూరు ను జిల్లా కేంద్రం చేసుకోవాలని ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక జార్జి క్లబ్ లో వారు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కానీ, అవకాశాల ప్రాతిపదికన కానీ అన్ని రకాలుగా ప్రొద్దుటూరు జిల్లా కేంద్రానికి అనువైన ప్రాంతం అన్నారు. ప్రస్తుతం మన ప్రతిపాదనలో వున్న జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాలకు దగ్గరగా వున్న ప్రాంతామని వివరించారు. కావున ప్రతి ఒక్కరూ అపోహలు వీడి జేఏసీ ఉద్యమంలో పాల్గొని ప్రొద్దుటూరు జిల్లా సాధనకు తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఇప్పటికే పలు వ్యాపార సంఘాలు, కుల సంఘాల ప్రతినిధుల మద్దతు కోరామని వివరించారు. త్వరలోనే తాము ప్రొద్దుటూరు ప్రజలతో ర్యాలీ, మానవ హారం నిర్వహించడంతో పాటు అసెంబ్లీ సమావేశాల సమయంలో మంత్రులు, ముఖ్యమంత్రి కి వినతిపత్రం సమర్పించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి, సి.వి. సురేష్, కె.జె. రఘు రామిరెడ్డి,



శెట్టిపల్లె రాం ప్రసాద్ రెడ్డి, భాస్కర్ రావు, సుధాకర్ రెడ్డి, గంగిరెడ్డి, బొర్రా రామాంజనేయులు, ముడిమెల కొండారెడ్డి, ఆయూబ్ ఖాన్, గజ్జల వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌ను పరిశీలించిన వైసిపి బృందం






**రిమ్స్ కడప మేజర్‌న్యూస్ :** కడప నగరంలోని రిమ్స్ సూపర్ స్పెషలిటీ, కాన్సర్, మెంటల్ హెల్త్ ఆసుపత్రులను ఈ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా , కడప మేయర్ కె. సురేష్ బాబు , జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ తదితరులు పరిశీలించారు.విద్య, వైద్యం, ఉపాధి పేదల హక్కు!" విద్యా, వైద్య రంగాలపై చంద్రబాబు తీసుకుంటున్న వైఖరిని తీవ్రంగా ఖండించిన నేతలు మాట్లాడుతూ, పేదలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచనను తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వ ఆసుపత్రుల ప్రైవేటీకరణను వ్యతిరేకించిన నేతలు కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైద్యశాలలను ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వడం దారుణమని అభిప్రాయపడారు. "వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ప్రారంభించిన ఆహారదాయక సంకల్పాలను చంద్రబాబు నీరసం చేస్తున్నాడు" అని పేర్కొన్నారు. సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి నుంచి వైఎస్ పేరును తొలగించడం ప్రజా మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు.

### వైద్య రంగంలో వైఎస్సార్ కాంగ్రెస్ పాలన ఘనతలు:

17 కొత్త మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన జగన్ హయాంలో జరిగింది.పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలు పూర్తి చేసినా చంద్రబాబు వాటిని వినియోగంలోకి తీసుకురాలేదని విమర్శించారు."సీమ నడిబొడ్డున ఉన్న కడపలోని రిమ్స్ ను సూపర్ స్పెషలిటీ హబ్‌గా మారుస్తామన్న జగన్ దృఢ సంకల్పాన్ని" గుర్తు చేశారు.

### ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ హెచ్చరిక:

ప్రజా ఆస్తులను ప్రైవేట్ చేతుల్లోకి బదిలీ చేసే కుట్రలు కొనసాగితే తీవ్ర స్థాయిలో ప్రజా ఉద్యమాలు చేపడతాం" అని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొమ్ము వాటిని కొంతమంది అనునాయులకు దోచిపెట్టే ప్రయత్నాలను సహించము" అని అన్నారు.వైఎస్ పేరు బోర్డులపై నుండి తొలగించినా ప్రజల గుండెల్లో ఆయన పేరు పదిలంగా ఉంటుంది.ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఓడిపోతాయి. వైద్య రంగాన్ని ప్రైవేట్ పరం చేయాలనుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు."ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ పోలేరమ్మ దేవత త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమం

### దప్పుల మోతలతో హోరెత్తిన పులివెందుల - జై అంకాలమ్మ జై పోలేరమ్మ జై పెద్దమ్మ అంటూ నినదించిన భక్తులు - పార్టీలకు అతీతంగా తరలి వచ్చిన నాయకులు





**(పులివెందుల/ మేజర్‌న్యూస్ :** పులివెందులలో ఆదివారం శ్రీ పోలేరమ్మ దేవత ప్రాంగణంలో జరిగే త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత ఘనంగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయమే ప్రతిష్టించాల్సిన త్రిశూలానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా త్రిశూలాన్ని శ్రీ అంకాలమ్మ దేవత ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు, బలులను సమర్పించారు. పెద్ద ఎత్తున మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని వచ్చి అంకాలమ్మ తల్లికి సమర్పించారు. చాలామంది మహిళలు మరిన్ని బోనాలు చేతపట్టి పోలేరమ్మ తల్లికి సమర్పించడానికి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దిన శ్రీ అమ్మవారి విగ్రహాన్ని స్థానిక శ్రీ అంకాలమ్మ దేవత ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా శ



బంగారం అంగళ్ళ వీధిలోని శ్రీ నడివీధి పెద్దమ్మ ఆలయం మీదుగా శ్రీ పోలేరమ్మ ఆలయం వరకు భారీ ఎత్తున ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ అంకాలమ్మ దేవత ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు కార్యక్రమంలో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని అమ్మవారిని స్మరించుకుంటూ పాల్గొన్నారు. అడుగడుగునా దప్పుల మోతలతో చిందులతో ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. ముఖ్యంగా మహిళా మణులు ఈ కార్యక్రమంలో నృత్యాలు చేశారు. బిజెపి నాయకులు ,ఆర్ఎస్ఎస్ నాయకులు పలువురు అమ్మవారి భక్తులు కదం తొక్కుతూ పదం పాడుతూ ముందుకు సాగారు. జై అంకాలమ్మ తల్లి జై పెద్దమ్మ తల్లి జై పోలేరమ్మ తల్లి అంటూ నినాదాలతో వీధులన్నీ హోరెత్తిపోయాయి. ముందుగా శ్రీ అంకాలమ్మ దేవతను పూజించిన అనంతరం నడివీధి పెద్దమ్మను పూజించారు. అక్కడ నుంచి పోలేరమ్మ ఆలయానికి చేరుకొని ఆలయ ముంగిట సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి త్రిశూలాన్ని ప్రతిష్టింపజేశారు.

## పార్టీలకతీతంగా తరలివచ్చిన నాయకులు

శ్రీ పోలేరమ్మ దేవత త్రిశూల ప్రతిష్ట కార్యక్రమానికి అమ్మవారిని దర్శించుకోవడానికి పార్టీలకు అతీతంగా నాయకులు తరలివచ్చారు. శ్రీ అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ తిరుమల శెట్టి నాగేంద్రప్రసాద్, నక్క చంద్రశేఖర్ లాయర్ నక్క నరసింహులు, కొంగనపల్లి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ దేవస్థానం దేవస్థానం చైర్మన్ చెన్నారెడ్డి, తెలుగుదేశం పార్టీకి చెందిన జడ్పిటిసి మా రెడ్డి లతా రెడ్డి, టిడిపి నాయకురాలు భూమిరెడ్డి ఉమాదేవి రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు తుగుట్ల మధుసూదన్ రెడ్డి, తూగుట్ల రాఘవరెడ్డి ,పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లాయర్ గజేంద్ర నాథ్ రెడ్డి, టైలర్ శివారెడ్డి , ముచ్చుమర్రి మహేశ్వర్ రెడ్డి శివారెడ్డి,బిజెపికి చెందిన రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ దాసరి భాను ప్రకాష్ , పగడాల రాజశేఖర్, బిజెపి సీనియర్ నాయకులు పుష్పాల శ్రీనాథ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, పులివెందుల ఆర్ఎస్ఎస్ ప్రముఖ సర్వేశ్వర్ రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు ప్రసాద్, కొమనపల్లి మురళి, కడియాల లక్ష్మీనారాయణ, ఎడాల సుబ్రహ్మణ్యం, ఏరువా వెంకటసుబ్బయ్య, అల్లం రంగనాయకులు రాయల్ అల్లం రంగనాయకులు రాయల్, ఐటిఐ ఆంజనేయులు, చాగలేటి శీను, గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు తోటం శెట్టి సుధాకర్, సందీప్, పాలెం శివ శంకర్ నాయుడు, తొండూరు శ్రీకాంత్, జర్నలిస్ట్ లు హరీష్ కార్తీక్, ఓం ప్రకా ష్ , చిక్కని హరి,జనసేన నాయకులు ఆలూరు జగదీష్ బాబు రాయల్, దాసరి ప్రవీణ్ కుమార్ ఐటిఐ సాయి, హిందూ జై హిందుస్థాన్ పార్టీ నాయకులు వంగల గోవర్ధన్ రెడ్డి, హిందూ జేఏసీ నాయకులు సాగర్ , యురేనియం వాసుదేవ రెడ్డి, అంగడి నాగేంద్ర, శ్రీనివాసులు శ్రీనివాసులు రెడ్డి, ఇప్పట్ల మధుసూదన్ రెడ్డి, సకల బద్రి, లోకేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల నుంచి తరలివచ్చిన హిందూ నాయకులు

పులివెందుల లోని శ్రీ పోలేరమ్మ దేవత త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గం లోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అందరూ అమ్మవారిని దర్శించుకుని ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేలాదిమందికి అన్న ప్రసాదం

శ్రీ అంకాలమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమానికి వచ్చిన వారికి స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగర్ లోని మిస్సమ్మ బంగ్లా నందు వేలాది మందికి మాంసాహార శాఖాహార భోజనాలు ఏర్పాటు చేశారు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

# గురువులకు అవార్డులతో పెరిగిన బాధ్యత

### ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి. - సన్మాన సభలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ కుమార్.



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో గురువుల బాధ్యత మరింత పెరిగిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ పోరుమామిళ్ల ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సన్మాన సభకు ఆయన ముఖ్యఅతి థిగా హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో అవార్డు పొందిన 14 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాదన విజయ కుమార్ మాట్లాడుతూ. డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవార్డుల ద్వారా ఉపాధ్యాయులను గౌరవించడం జరుగుతుంద న్నారు. అందులో భాగంగా ఇటు జిల్లా స్థాయిలోను, అటు రాష్ట్ర స్థాయిలోనూ పోరుమామిళ్ల ప్రాంత ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం అభినందనీయ మన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడానికి వెనుక ఉపాధ్యాయుల విశేషమైన కృషి దాగి ఉందన్నారు. మారుతున్న సమాజంలో గురువుల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్పోరేట్ మాయాజాలంలో పడి ప్రభుత్వ విద్యపై విముఖత చూపుతున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పాటు పడతామన్న కూటమి ప్రభుత్వం ఆ వైపుగా ప్రయత్నించడం లేదని ఆరోపించారు. అందులో భాగంగానే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారని విమర్శిం చారు. పోరుమామిళ్ల, కాశినాయన మండల విద్యాశాఖాధికారులు కొండిశెట్టి, ఓ.నిర్మల లు మాట్లాడుతూ వినూత్నమైన పద్ధతిలో విద్యాబోధన చేయడమే కాకుండా, అహర్నిశం విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడడంతోనే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయన్నారు.యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు చెన్నయ్య,బాలజోజి, సాంస్కృతిక కమిటీ జిల్లా కన్వీనర్ కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. 12వ పిఆర్సీని అమలుకు కనీస చర్యలు లేవన్నారు. పిఆర్సీ చైర్మన్ ను సైతం నియమించకపోవడం దుర్మార్గమన్నారు. విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు రణభేరి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా జాతా కార్యక్రమం నిర్వహిస్తున్నా మని, అందులో భాగంగా 19వ తేదీ మధ్యాహ్నం పోరుమామిళ్ళకు జాతా చేరుకుంటుందని తెలిపారు. ఈ జాతాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో మార్కా రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.నారాయణరెడ్డి, గురుమూర్తి, ఓ.రాయప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి భైరవ ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు బాలజోజి, ఎం.రమణమూర్తి పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కృష్ణయ్య, ఖాజా నాయబ్ రసూల్, బాల ఓబయ్య, కె.వి.సుబ్బారెడ్డి, బి.భాస్కర్ రెడ్డి, కె.చెన్న కృష్ణయ్య, కె.పిచ్చిరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తెల్లపాడు రామాపురంచెరువులకు నీళ్లు ఇవ్వండి

### వైఎస్ఆర్సిపి ఐటీ వింగ్ ప్రెసిడెంట్ బాసి రెడ్డిమధుసూదన్ రెడ్డి



**కలసపాడు మేజర్‌న్యూస్ :** ఎగువ రామాపురం వైయస్సార్ పార్టీ కార్యాలయం నందు బద్వేలు నియోజకవర్గం ఐటీ వింగ్ ప్రెసిడెంట్ బాసిరెడ్డి మధు సుధన్ రెడ్డి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తూ కలసపాడు మండలం తెల్లపాడు గ్రామ పంచాయతీలో తెలుగుగంగ ఎడమ కాలువ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వార నీటిని తరలించి తెలుగుగంగ కాలువ పై భాగాన ఉన్న ఎగువ రామాపురం తడుకువాగు చెరువు,తిక్కమ చెరువు,మేలకుంట చెరువు,దూలంవారిపల్లె చెరువు,తదితర ఏడు చెరువులు నింపి త్రాగు నీరు సాగునీరు సమస్య పరిష్కరించి కలసపాడు, కాశినాయన మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలను రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని గత 20 సంవత్సరాలనుండి అనేక మార్లు, అధికారుల, రాజకీయ నాయకుల దృష్టికి తీసుక వెళ్లిననూ పరిష్కరించ లేని సమస్యను గత ప్రభుత్వంలో, ఎమ్మెల్సీ డీసీ గోవిందా రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్య మంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి ని కలిసి నీటి సమస్య ను తెలియచేయడం జరిగింది వెంటనే అయినా స్పందిస్తూ ఎలక్షన్ కంటే ముందుగా మీ సమస్యను పరిష్కరిస్తాను అని మాట ఇవ్వడం కూడా జరిగింది, అప్పుడు పక్కనే ఉన్న వైస్ అవినాష్ రెడ్డి కి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కచ్చితంగా చేయండి అని చెప్పడం జరిగింది,మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పినట్టు గానే కడప పార్లమెంట్ సభ్యులు, వై యస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ తదితర నాయకులు కలసిన ఒక వేదిక పై రైతులమంతా, మా సమస్యను వారి దృష్టికి తీసుక వెళ్లి న సుమారు 75రోజుల లోపల యుద్ధ ప్రాతిపదికన,సంబంధిత అధికారులచే, పనులు, 18 కోట్ల రూపాయలు,ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వార మా చెరువులకు,ఎన్నికలకు ముందే, తెలుగుగంగ ఎడమ కాలువ నీరు చెరువులకు,విడుదల చేసి,త్రాగునీరు,సాగునీరు సమస్య నుండి, రైతులను ,రైతుకూలలను, ఆదుకున్న ఘనత వై యస్ ఆర్ సీపీ పార్టీ నాయకులదే. ,కానీ పై సమస్య గురించి,ఏ నాడు పట్టించుకోని, స్థానిక టిడిపినాయకులు, తాలూక నాయకులతో ఎన్నికల తర్వాత కొన్ని నెలలకు చాల అట్టాహాసంగా, రీ,ఓపెన్ చేసి పూలమాలలు వేసి సంకలు గుద్దుకొని సంతోష పడినారు. ఇటీవల సుమారు 25 రోజుల కిందట తెలుగుగంగ ఎడమ కాలువకు నీరు వదలినారు. ఇప్పటికి ఒక్క చుక్క నీరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వార వదలలేదు.మోటర్లు రిపేరి,ట్రాన్సుఫార్మర్ రిపేరి అని కాలయాపన చేస్తున్నారు,గత ప్రభుత్వం త్వరితగతిన పనులు పూర్తి చేయుటకు తన స్వంత పొలం ఇచ్చి సహకరించినందుకు అక్కడ వాచ్ మెన్ గా పనిచేస్తున్న ఒక పేద నిరుద్యోగ రైతు బిడ్డపై కక్ష కట్టి మీ రాజకీయ అధికార బలంతో అధికారులపై వత్తిడి తెచ్చి,అతనిని తొలగించిన మీ అధికార పలుకుబడి ఇప్పుడు ఏమైంది కేవలం కక్ష సాదింపుకు తప్ప, పేద ప్రజలకు, రైతులకు మీరు మీ నాయకులు ఉపయోగ పడరా?ఈరోజు రైతులు,ఎంత పెద్ద యెత్తున మొత్తుకున్నా మీకుచలనం రాదా?,చైర్మన్ గా, మెంబెర్స్ గా నియమితులు అవ్వడం వరకేనా పదవులు రైతులు కష్టాలు కన్నీళ్లు కనిపించవా ఇప్పటికైన సంబంధిత అధికారులు , అధికార పార్టీల నాయకుల చొరవ చూపి చెరువులకు నీరు విడుదల చేయనిచో ప్రజలు రైతులు, రైతుకూలీల తరుపున వై యస్ ఆర్ సీ పి పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరిక చేస్తున్నాం. అలాగే కాశీనాయన మండలంలో మొత్తం రూ.14 కోట్ల వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ గత ప్రభుత్వంలో శాంక్షన్ చేయబడింది. అందులో రూ.11 కోట్లతో పనులు పూర్తిచేయగా, 2024 ఎన్నికల కారణంగా మిగిలిన రూ.3 కోట్ల పనులు ఆగిపోయాయి.ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం మిగిలిన రూ.3 కోట్లను శాంక్షన్ చేసి పనులను పూర్తి చేస్తే, కాశీనాయన మండలంలోని సుమారు 5,000 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది

## ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

### ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథ రెడ్డి




**మైదుకూరు మేజర్‌న్యూస్ :** కూటమి అధికారం చేపట్టి 16 నెలలైనా మేనిఫెస్టోలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదార్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. కడప జిల్లా ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గసమావేశం ఆదివారం మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీలో జరిగింది. ఈ కార్యక్రమం లో రఘునాథరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్ సీ అమలు, మధ్యంతర భృతి, బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి వాటిని నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. స్కూలు అసిస్టెంట్లకు ఎంఈవో-1 బాధ్యతలు అప్పగించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామన్నారు. గత పన్నెండు నెలలుగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపులు జరగడం లేదన్నారు.కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను ఆర్థికపరమైన అంశాల హామీ అమలు విషయంలో వంచనకు గురి చేయవద్దని ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఎంప్లాయ్ వెల్ఫేర్ స్కీమ్స్ వీటిని అమలు చేయలేదని 12వ పిఆర్సి అమలు ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని కానీ మధ్యంతర భృతి ప్రకటననే చేయలేదని ఇప్పటికి నాలుగు డిఏలు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం బకాయి ఉందని 20 వేల కోట్లకు పైగా బకాయిలు ఇంకను చెల్లించవలసి ఉంది కానీ ఎటువంటి ఆశాజనకమైన పరిస్థితులు పాలక పక్షం వైపు నుంచి కనిపించడం లేదన్నారు. కాబట్టి అక్టోబర్ నెలలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల సాధనకై ఉద్యమ కార్యాచరణకు దిగుతామని ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మరోవైపు అసంబద్ధ తిరోగమన విధానాలతో విద్యా రంగానికి నష్టం వాటిల్లుతుందని మూల్యాంకన విధానాన్ని సవరించాలని ప్రశ్నాపత్రాల రూపకల్పనలో ప్రామాణికత పాటించలేదని ఆయన అభిప్రాయపడ్డారు డీఎస్సీ 2025 ద్వారా అన్ని ఖాళీలు భర్తీ చేసి బదిలీ పొందిన ప్రతి ఉపాధ్యాయుడికి రిలీవర్లను కేటాయించాలని కోరారు. పదవి విరమణ ద్వారా ఏర్పడ్డ పీహెచ్ఎస్ఎం పోస్టులు భవిష్యత్తులో స్కూల్ అసిస్టెంట్లతో సర్దుబాటు చేయకుండా ఎస్టీజీలతో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పూర్తిగా తొలగించాలని ఇవి బహుళ తరగతులకు బోధిస్తున్న సెకండ్ గ్రేడ్ టీచర్ లకు తలబారంగా తయారైందన్నారు. పై చర్య లపై నాయకత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యవర్గ సమావేశంలో నాయకులు సురేష్ బాబు, సుబ్రహ్మణ్యం, రాజు, బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, పాలకొండయ్య, రామ్మోహన్, వెంకటసుబ్బయ్య, కొత్తపల్లి శీను, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, ఎస్టియు నాయకులు బండి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సూర్య కృష్ణయ్య, గురు కుమార్, మల్లేష్‌రెడ్డి, బి.కే.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలి

### ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాష



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్లలోని ఏపీటీఎఫ్ రీజియన్ ప్రాంతీయ కార్యాలయం నందు కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ భాష పాల్గొని, అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన కరువు భత్యం, 4% డిఏ 30% ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ చైర్మన్‌ను వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలను విడుదల చేయాలని రీజనల్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ కోరారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, మూల్యాంకన విధానంలో మార్పు చేసి ఉపాధ్యాయుల బోధనను సరళతరం చేయాలని బి కోడూరు అధ్యక్షుడు ఆనంద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.భాస్కర్ రెడ్డి, సుబ్బయ్య అన్వర్ భాష సురేంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆదిశేషారెడ్డి, సీతారామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి కే.కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## అంబరాలంటిన రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్ట్ సంక్షేమ సేవ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కడప అన్నమయ్య జిల్లాల ఉమ్మడి ఆర్యవైశ్య జర్నలిస్టులు హాజరు..**

**ఆవిర్భావ సంబరాలను వేడుకలుగా జరుపుకున్న జర్నలిస్టు మిత్రులు.**

**ఉమ్మడి జిల్లాలో ఆర్యవైశ్య జర్నలిస్టుల ఐక్యతకు ఈ సంబరాలు నిదర్శనం..**

**రానున్న రోజులలో ఆర్యవైశ్య జర్నలిస్టులు ఉన్నత పదవులు అలంకరించాలని వక్తల సందేశం**

**ఉమ్మడి జిల్లాల జర్నలిస్టులను సన్మానించిన బద్వేల్ నియోజకవర్గ జర్నలిస్టులు..**







**బద్వేల్, మేజర్‌న్యూస్ :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు కడప,అన్నమయ్య ఉమ్మడి జిల్లాలో పలువురు జర్నలిస్టుతో కలిసి ఆదివారం బద్వేల్ పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, కోకన్వీనర్ల ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాలలోని పలువురు జర్నలిస్టులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధన లక్ష్మి, పత్తి హేమలత, పుష్పలత, వల్లంకొండు ధనలక్ష్మి, అక్కిసెట్టి జ్యోతిర్మయి, కొండపల్లి సుగుణ, లక్ష్మీకాంతమ్మ సముద్రాల పద్మావతిల ఆధ్వర్యంలో పలు వురు జర్నలిస్టులతో కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించి, అనం తరం అమ్మవారి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో హాజరైన పలువురు మహిళలకు శాలువాతో సత్కరించడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్య క్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మాజీ అధ్యక్షులు కె.వి సుబ్బారావు, మున్సి పల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ, ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, సీనియర్ న్యాయవాది పి,వి,ఎన్ ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనుమరుల పూటీ ప్రసాద్, శ్రీ రాచపూడి నాగభూషణం కళ్యాణ మండపం అధినేత డాక్టర్ రచపూడి దిలీప్ కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పెసల నాగరాజ ఫౌండేషన్ నిర్వాహకులు పెసల నాగరాజు, వాసవి క్లబ్ అధ్యక్షులు అనుమల శెట్టి సిద్దయ్య, చాటుకొండు వెంకటసుబ్బయ్య తో పాటు పలు వురు పాల్గొన్న వారికి సాధర్వంగా ఆహ్వానం పలికి శాలువాతో పలువురిని జర్నలిస్టులు వారిని సత్కరించారు, అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి జర్నలిస్టులను వారి సేవలను అభినందిస్తూ పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు శాలువాతో సత్కరించడం జరిగింది, అలాగే ఉమ్మడి జిల్లాలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హాజరైన పలువురికి శివా టెక్స్ టైల్స్ యజమాని తులసి వెంకట శివ నారాయణ, పావని టెక్స్ టైల్స్ యజమాని కోట మధుసూదన్ సహకారంతో పలువురికి పట్టు పంచ, పట్టు టవలను పలువురికి అందజేశారు, జర్నలిస్ట్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ స్టేట్ ఆర్యవైశ్య జర్నలిస్ట్ సంక్షేమ సేవా సంఘం అనే కమిటీని కన్వీనర్ రవికుమార్, మరియు కో కన్వీనర్స్ ఒక నామకరణం చేయడం ఎంతో సంతోషకరమన్నారు, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వారిదలా పని చేసే జర్నలిస్టులు సేవలు మరువ లేనివన్నారు, ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి మండలం, ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఆర్యవైశ్య జర్నలిస్టులను గుర్తించి ఒక వేదిక పైకి ఆహ్వానం పలికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం అనేది చాలా గొప్ప సంకల్పమని పలువురు వక్తలు కన్వీనర్ కోకన్వీనర్లకు వారు అభినందనలు తెలిపారు, కడప అన్నమయ్య జిల్లాలలో పనిచేసే జర్నలిస్టులకు ఏ అవసరం వచ్చిన తాము ఎల్లవేళలా వారికి చేయూతనిచ్చే విధంగా అందుబాటులో ఉంటామన్నారు,సమిష్టి కృషి తో మరికొందరు కూడా ఆర్యవైశ్యులు జర్నలిస్టులుగా ముందుకు వచ్చి మనలో మనకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. అమ్మవారి ఆశీస్సులతో మీ సంఘం దిన దిన అభివృద్ధి చెందాలని పలువురు ఆశీర్వదించారు, అనంతరం కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఇంచార్జ్ వల్లంకొండు వెంకటరమణ, చలపాటి రవికుమార్ తోపాటు పలువురు మాట్లాడుతూ కలం కౌంటర్ అధినేత రవికుమార్ గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో ప్రతి మండల స్థాయిలో ఉన్నటువంటి ఆర్యవైశ్య జర్నలిస్టులను గుర్తించి ఒక గ్రూపులోకి చేర్చి ఒక వేదిక పైన కలవాలని దృఢ సంకల్పంతో గత నెల 31వ తారీఖున పెనుగొండలోని అమ్మవారి పాదాల చెంత ఆర్యవైశ్య మీడియా సోదరుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం అక్కడ స్టేట్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అని నామకరణం చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో నియోజకవర్గాలు ఆవిర్భావ దినోత్సవం వేడుకలను అంగరంగ వైభవ నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు, రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ దేవతి భగవత్ నారాయణ, భవిరిశెట్టి రామారావు, గోగుల శ్రీనివాసరావు, ఓబుల శెట్టి రాధాకృష్ణ దాస్, చెక్క కేశవ గారి ఆదేశాల మేరకు ఆదివారం కడప అన్నమయ్య ఉమ్మడి జిలాల్లైన బద్వేల్ పట్టణంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం కనుల పండగగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది, ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా బద్వేల్ జర్నలిస్ట్ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురికి ప్రత్యేక విందు నిర్వహించడం జరిగింది. ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో చీదేళ్ల సుబ్బారావు, కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, చెవుల జయప్రసాద్, నేలపాటి లక్ష్మీనారాయణ,తల్లం సుధాకర్, మెంటా వెంకట నాగేంద్ర, ప్రసాద్, కొణిజేటి చంద్రశేఖర్, చిదెల్ల వెంకటసుబ్బయ్య, సతీష్, రామకృష్ణ, మోటపోతుల శివకుమార్, అంబటి వెంకట బాలాజీ బైసాని కిరణ్ కుమార్ తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు



## 32 ఏళ్ల తర్వాత పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక

### గురువులను ఘనంగా సత్కరించిన పూర్వపు విద్యార్థులు



**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి తను చదువుకున్న రోజులు చేసే అల్లరి స్నేహితుల తో కలిసి ఆడిన ఆటలు ఇవన్నీ ఓ మధురమైన క్షణాలు మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 32 ఏళ్ల తర్వాత కలుసుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ 32 సంవత్సరాల క్రితం విద్యాబుద్ధులు నేర్పిన 16 మంది గురువులను గుర్తుపెట్టుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం వారిని ఘనంగా సన్మానించడం గొప్ప విషయమని కొనియాడారు. 1993-94 విద్యా సంవత్సరం నాటి పూర్వపు విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకొని ఆనందంగా గడిపారు. వాట్సాప్ వేదికగా గత కొన్ని నెలల నుంచి మిత్రులందరికీ ఒకరినొకరు పరిచయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకొని మధుర జ్ఞాపకాలను తలచుకుంటూ సంతోషంగా గడిపారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు ఇన్వర్టర్ తో పాటు మరో కన్నీ వస్తువులను పాఠశాలకు బహూకరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పాఠశాలకు తమ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ముని రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సంగిరెడ్డి, మైసురయ్య, మనోహర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి,పుల్లమ్మ ,శివ ప్రభాకర్ రెడ్డి, చంద్ర ఓబుల రెడ్డి, నాగేంద్రరావు, నారాయణదాసు, సరళ దేవి లతోపాటు పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ప్రతిష్ఠాపనలో పూజలు భూమిరెడ్డి ఉమాదేవి ప్రత్యేక పూజలు

గ్రామదేవతలకు బోనాల సమర్పించిన భూమి రెడ్డి ఉమాదేవి



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలో అంగరంగ వైభవంగా త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ కార్యక్రమంలో అమ్మవారిని పురవీధుల్లో మేళ వాయిద్యాలతో డప్పులు వాయిస్తూ ఊరేగింపుగా తీసుకొచ్చారు.అంకాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, పోలేరమ్మ తల్లులకు పట్టణంలోని, చుట్టుపక్కల గ్రామాల్లోని మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై బోనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందు జేసి నాయకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరై పోలేరమ్మ అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాల సమర్పించి అమ్మవారి ఆశీస్సులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ :** బ్రహ్మం గారి మఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ చీకటివారిపల్లె నందు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో టీడీపీ మండల యువ నాయకులు కానాల మల్లి కార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా ప్రారంభించారు.దశాబ్దాలుగా తమ గ్రామంలో ఏ అభివృద్ధి పని జరగలేదని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ చొరవతో తమ గ్రామం అభివృద్ధి చెందుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐకమత్యంతోనే కార్పెంటర్లు గౌరవం, గుర్తింపు సాధించుకోగలం

ప్రొద్దుటూరు కార్పెంటర్స్ యూనియన్ నాయకులు షేక్ చాంద్ బాషా, వీరాంజనేయ చారి

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** నానాటికి పెరుగుతున్న ఆధునికత సంప్రదాయ వృత్తికి తగ్గుతున్న విలువ మధ్యవర్తుల ఆధిపత్యం కుటుంబ పోషణ భారంగా మారుతున్న కార్పెంటర్ల అభ్యున్నతికి సమాజంలో తగిన స్థానం దక్కాలంటే మనందరం ఐకమత్యంతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొద్దుటూరు కార్పెంటర్స్ యూనియన్ నాయకులు షేక్ చాంద్ బాషా వీరాంజనేయ చారి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గోపవరం పం చాయతీ పరిధిలోని దువ్వూరు బైపాస్ రోడ్డులో ఉన్న డోర్ డిజైనింగ్ వర్క్ షాప్ ఆవరణలో మండల పరిధిలోని కార్పెంటర్లతో సమావేశం నిర్వహిం చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ నిర్మాణాలలో మధ్యవర్తులు ఆధిపత్యం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల మూలంగా మనందరికీ డిమాండ్ లేక జీవన భారం పెరిగిపోతోందని అన్నారు. శ్రమకు తగిన పారితోషకం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఆధునికత పేరుతో యాంత్రిక పరమైన పనులు పెరిగి సంప్రదాయ వృత్తికి విలువలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు గతంలో కుటుంబాల గౌరవం నిలపెట్టే కార్పెంటర్ వృత్తి నేటి పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారంగా మారడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా కార్పెంటర్లు అంతా కలసి తమ సమస్యలను సమాజానికి తెలియజేయడానికి కరపత్రాన్ని విడుదల చేశారు.



ఇప్పటినుండి అయినా కార్పెంటర్ లతా సంఘటితంగా ఏకమై తమ వృత్తిని కాపాడుకోవడంతోపాటు సమాజంలో శ్రమకు తగిన గౌరవం సాధించేందుకు అడుగులు వేసే దిశగా త్వరలో కార్పెంటర్ల అసోసి యేషన్ ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు అందులో ప్రతి ఒక్క కార్పెంటర్ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసచారి ఉదయ్ కుమార్ ఆచారి తప్పెట నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారత పార్లమెంటు సమావేశంలో కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి



**కడప రూరల్ – మేజర్‌న్యూస్:** తిరుపతిలో తొలిసారిగా రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారతపై పార్లమెంటు, శాసనసభ కమిటీల సమావేశంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఆధ్వర్యంలో "వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం" అనే అంశంపై ఆదివారం ఈ సదస్సు నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల ఎదుగుదల మరియు సవాళ్లను అధిగమించడంలో మహిళా సాధికారత ప్రాధాన్యతపై చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) చైర్‌పర్సన్ దగ్గుపాటి పురందేశ్వరి, అలాగే వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ప్రతినిధులు హాజరయ్యారు.

## కడప నగరంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు



**కడప క్రైమ్ మేజర్ న్యూస్:** కడప నగరంలో ఆదివారం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓబులేసు, ఎస్సై రాజరాజేశ్వర్ రెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులతో అంబేద్కర్ సర్కిల్, అప్సర సర్కిల్ ప్రాంతాలలో ఆకస్మికంగా వాహనాలు తనిఖీ చేపట్టారు, వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు, ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులను సైతం విచారించి అనుమానితులను వారి వద్ద ఉన్న ఐడి ప్రూఫ్ పరిశీలించి బ్యాగులను సైతం తనిఖీ నిర్వహించారు, స్టేషన్ పరిధిలో ఉన్న లాడ్జిలను తనిఖీ చేసి గదులను సైతం పరిశీలించారు, గదుల్లో ఉన్న వ్యక్తుల ప్రూఫ్స్ అడిగి పరిశీలించారు, అనుమానిత వ్యక్తులకు లాడ్జిలలో గదులు ఇవ్వవద్దని యజమానులను ఆదేశించారు.

## కలసపాడు పోలీస్ స్టేషన్లోలో 1 హెడ్ కానిస్టేబుల్ 3 కానిస్టేబుళ్లు బదిలీ

**కలసపాడు మేజర్‌న్యూస్:** మండలంలోని కలసపాడు పోలీస్టేషన్లో పనిచేస్తున్న పోలీసులు శనివారం కడప జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు కలసపాడు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్. భాస్కర్ నుఅట్లూరుకు కానిస్టేబుళ్లు శ్రీనివాసులను బి కోడూరుకు హుస్సేన్ ను చాపాడుకు సుబ్బరాయుడు ను కమలాపురం లకు బదిలీ అయినట్లు కలసపాడు ఎస్సైఎల్ తిమోతి తెలిపారు.

# కె.సి.ఆయకట్టులో వరి జాతర

సమృద్ధిగా పొలాలకు సాగునీరు – ఏపుగా పెరుగుతున్న వరి కర్రలు



**రాజుపాళెం,మేజర్ న్యూస్:** సకాలంలో సమృద్ధిగా సాగునీరు అందుకు అనుగుణంగా అడపాదడపా వర్షాలు కెసి కుందూపరిధిలో వరి సాగుతో పచ్చదనం సంతరించుకుంది అనుకూలించిన వాతావరణంతో ఏపుగా పెరుగుతున్న వరి కర్రలతో రైతాంగానికి ఊరట కలిగిస్తుంది ఇదే పరిస్థితిలు రైతులకు అనుకూలిస్తే వరి పంట సాగులో మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి పై ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో ముందస్తుగా ప్రజా ప్రతినిధులుఇరిగేషన్ అధికారుల చొరవతో సాగునీటికి మార్గము సుగమం అయింది అందుకు అనుగుణంగా రైతులు వరి నారు దొడ్లు సిద్ధం చేసుకుని నాట్లు వేశారు ముందుగా కుందూ నది పరివాహక ప్రాంతంలో ఆ తర్వాత కెసి ఆయకట్టుపరిధిలో వరి నాట్లు వేసుకున్నారు మిగిలిన కొన్ని గ్రామాల్లో ఇక వారం రోజుల్లో వరి నాట్లు పూర్తికానున్నాయి ముందుగా వేసిన వరి పంట సాగు కెసి కుందూపరివాహక పరిధిలో ఏపుగా పెరుగుతున్న వరి కర్రలతో రైతులకు సంతోషాన్ని కలిగిస్తోంది రాజుపాళెం మండలంలో జిల్లా సరిహద్దులోని రాజోలి గ్రామం దగ్గర నుండి కుందూ పరివాహకం చాపాడు కెసి కాలువ ఆయకట్టు పరిధిలోని గ్రామాలైన పుణ్యక్షేత్రమైన వెల్లాల పగిడాల దద్దనాల కూలూరు కొట్టాల టంగుటూరు తొండలదిన్నె వెలవలి గ్రామంలో విస్తారంగా రైతులు వరి పంటను సాగు చేశారు వ్యవసాయ అధికారుల అంచనాల మేరకు కుందూ నది పరివాహకం చాపాడు కెసికాలువ ఆయకట్టు పరిధిలో సుమారుగా 4 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు అందులో జగిత్యాలు జీలకర్ర ఎన్డీఎల్ వంటి రకాలతో వరి పంటను సాగు అయింది ఈ ప్రాంతంలో కూలీలు కొరత అధికంగా ఉన్నందువల్ల బీహార్ మధ్యప్రదేశ్ పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో వరి నాట్లు సకాలంలో వేసుకున్నారు వరి పంట సాగులో వెన్ను దశలో దోమపోటు మెడ విరుపు తదితరతెగుళ్లు నుంచి బయటపడితే అనుకున్న మేర దిగుడులువస్తాయని ఈఏడు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్ కు సమృద్ధిగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో కెసి ఆయకట్టు రైతులకు ఊరట కలిగిస్తుంది

## అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీ పంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పురస్కరించుకుని ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనా మార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మ వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గ్రామదేవతలగా కొలువైన బంగారంగళ్ళ వీధి చివరిలో పోలేరమ్మ శంకు స్థాపన కార్యక్రమాలు అమ్మవారికి బోనాల సమర్పించు కార్యక్రమాలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ, అంకాలమ్మ తల్లిని దర్శించుకునేందుకుప్రతి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు, నైవేద్యాలు, సమర్పించి మొక్కులు చెల్లించ డం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

### డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించు కోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

**సభాభవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ..**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు లినమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం..**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఫిజియోథెరపిస్టులకు 'డాక్టర్' పేరు పెట్టుకునే హక్కు

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** డిజిహెచ్ఎస్ విడుదల చేసిన లేఖ వెనక్కి తీసుకోవడం జరిగింది. ఫిజియోథెరపిస్ట్ పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవచ్చు పేరు చివర ఫిజియోథెరపిస్ట్ అని ఖచ్చితంగా పెట్టుకోవాలి ఫిజియోస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్. యం. ప్రభుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిఏహెచ్‌పి 2025 కరికులమ్ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అన్ని అనుమతులతో జి.ఓ. వచ్చిన తర్వాత కూడా ఫిజయోథెరపిస్ట్‌లను అగౌరవ పరిచేలా డిజిహెచ్ఎస్ వారు బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సరైన అవగాహనా లేకుండా లేఖలు రాయడం అంటే పార్లమెంట్‌ను, కేంద్ర ప్రభుత్వ విధానాలను అగౌరవ పరచడం అవుతుంది.. డిజిహెచ్ఎస్ వారు లేఖను వెనక్కి తీసుకున్నప్పటికి ఫిజియోథెరపిస్ట్‌లకు అన్యాయం జరుగుతన్నదని, ఇది పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి అని కోరుకుంటున్నాము అని డాక్టర్. యం. ప్రభుదాస్ కోరారు. ఇప్పుడు ఫిజియోథెరపి చదివిన విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు 'డాక్టర్' అనే పదాన్ని తమ పేరుకు ముందు ఉపయోగించచ్చు .నీట్ పరీక్షా అనివార్యంగా మారింది - ఫిజియోథెరపి బిపిటిలో ప్రవేశించాలంటే 12 వ తరగతి (బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) తో పాటు నీట్‌లో ఉత్తీర్ణత అవసరం. బిపిటి డిగ్రీ (బాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి) కాలం 5 సంవత్సరాలు (4 ఏళ్లు 01 ఏడాది ఇంటర్న్‌షిప్) కు పెరిగింది. నేషనల్ కమిషన్ ఫర్ ఎల్లైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ ప్రకారం బి పి టి పూర్తి చేసినవారు డాక్టర్ డి ఆర్ అనే పదాన్ని ముందు,పి టి అనే పదాన్ని తర్వాత డాక్టర్ నేమ్ పి.టి. వినియోగించవచ్చు.

**ప్రధాన అంశాలు**

ఫిజియోథెరపిస్ట్‌కి ప్రస్తుతం భారతదేశంలో మరింత గౌరవం, ప్రాధాన్యం లభించింది. "డాక్టర్" అనే ఉపనామం వినియోగించేసే హక్కును అధికారికంగా గుర్తించారు. ఇతర వైద్యవృత్తిలోని డాక్టర్లతో కలికితురాలో కాకుండా, పి.టి. సఫిక్స్ ఫిజియో తెరపిస్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇది 1916లో అడిగిన ప్రాముఖ్యతకు స్మరణగా పేర్కొంటున్నారు.

**ప్రయోజనాలు.**

ఫిజియోథెరపిస్టుల విద్య, ప్రాముఖ్యత, స్థానాన్ని పెంచేలా ప్రభుత్వ మార్పులు చోటు చేసుకున్నాయి. గ్లోబల్ స్టాండర్డ్స్ కి భారత్ ఫిజియోథెరపీ రంగాన్ని సమం చేసింది.ఇది ఫిజియోథెరపి విద్యార్థులకు, ప్రాక్టీస్ చేస్తున్నవారికి గర్వంగా, ప్రోత్సాహంగా మారింది. ఫిజయోథెరపిస్ట్‌లు కూడా జనరల్ మెడికల్ ప్రాక్టీస్ చేయకుండా ఫిజియోథెరపి చికిత్స మాత్రమే చేయాలి అని కోరడం జరిగింది. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుకుంటున్నామన్నారు.

**డాక్టర్. యం. ప్రభుదాస్**



## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు రాష్టప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని వారి కార్యాలయంలో పిఎస్‌యు రాష్ట్ర కమిటీ సమా వేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పిఎస్యు జాతీయ అధ్యక్షుడు మహమ్మద్ షఫీ ఉల్లా ఆర్ఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ బీఈడీ ఎంబీఏ ఎంసీఏ ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న 6,400 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77 రద్దు చేసి ఉన్నత విద్యను ప్రోత్సహించే విధంగా ప్రతి ఒక్క విద్యార్థికి స్కాలర్షిప్



ఫీజు నెంబర్స్మెంటు అందించాలని కోరారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పి ఎస్ యు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు

## పెన్షన్ మంజూరు చేయ్యండి సారూ..



**కలసపాడు మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి వారి అర్హతను బట్టి పెన్షన్ కేటాయించడంలో అధికారులు మొండి వైఖరితో పేదవాడి నోటికాడి కూడును గద్దలకు వేస్తున్నారని బాధితురాలు ఆవేదన చెందింది. కలసపాడులో ఎంతోమంది అర్హత లేని వారు తమకు అనుకూలంగా ఉండే వారికి అక్రమంగా పెన్షన్లు పొందుతున్నారని ఆమె ఆరోపించారు.మండలంలోని ముద్దం వారి పల్లె గ్రామ యాదవ కాలనీకి చెందిన బొజ్జ ఇందిరమ్మ గత 12 సంవత్సరాల నుంచి పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నదని సదరం సర్టిఫికెట్ నందు 75% అర్హత ఉన్న కేవలం ఈమెకు పింఛను 6000 మాత్రమే ఇవ్వడంలోని మతలబు ఏమిటో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసింది. మంచానికి పరిమితమైన బాధితురాలు ఇందిరమ్మకు 6000 పెన్షన్ రావడం చాలా దారుణమని వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అధికారులు సదరం సర్టిఫికెట్ మంజూరు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయాలని మండలంలో పింఛను సరిగా అందడం లేదని అర్హత లేకుండా సదరం సర్టిఫికెట్ సంపాదించుకొని వేలాది రూపాయలు పింఛన్లు తీసుకుంటున్నారని సునీల్ కుమార్ ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈమెకు న్యాయం చేయాలని కోరారు.లేని పక్షంలో జిల్లాలోని అనర్హులైన వారు ఎక్కడెక్కడ లబ్ధి పొందు తున్నారో అలాంటి పెన్షన్ పొందుతున్న వారీ వివరాలను బహిరంగ పరిచి. వాటన్నిటిని ఏ విధంగా మంజూరు చేశారు అనర్హులైన వారి వివరాలను కూడా బహిర్గతం చేయడానికి వెనుకాడేది లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్హులైన పేదల కడుపు కొట్టకుండా వారికి జీవన ఉపాధి సౌకర్యం కల్పించి పేద కుటుంబాలను ఆదుకోవాలని ఆయనఅధికారులను కోరుకోంటుంది.

## తెలుగు నేలపై తొలి "తెలుగు రాజకీయ ఖైది" గాడిచర్ల

**"స్వరాజ్య"" పత్రిక ద్వారా ఆంగ్ల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన ధీరుడు.**

**డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఉద్ఘాటన**

**పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్:** గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకీయాలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంగ్ల ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉండేవని, అందువల్లనే ఆయన తన సంపాదకీయంలో ప్రభుత్వాన్ని పరుషంగా నిందిం చారనే నెపంతో జైలుకు పంపించారని, అలా తెలుగు నేలలో ఆయనే తొలి తెలుగు రాజకీయ ఖైదీ అయ్యారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహా య పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివా రం ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతి ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కల సి ముందుగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల సమర్పిం చి నివాళులర్పించారు. ఆ తర్వాత డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ గాడిచర్ల 1907లో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారని, రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలతో ఉత్తేజితు ల్కై వందేమాతరం ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. అందువల్ల ఆయన ను బ్రిటీష్ ప్రభుత్వం కళాశాల నుండి బహిష్కరించడమే కాక ఆయనకు ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో బాలగంగాధర తిలక్‌లా ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలను మెచ్చి ప్రజలు ఆయనను 'ఆంధ్ర తిలక్' అని పిలిచారన్నారు. 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో చిలుకూరి నారాయణరావు దత్తమండలాలకు 'రాయల సీమ' అనే పేరును సూచించగా, గాడిచర్ల వారు ఆ ప్రతిపాదనను బలపరచా రన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఆయన 'సౌందర్యవల్లి' అనే పత్రిక నడిపారన్నారు. మ రో సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సా గుతున్న కాలంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాలయ ఉద్యమం ద్వారా, తన సంపాదకీయాల ద్వారా ప్రజల్లో



స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. కడపజిల్లా పర్యటనలో గాంధీజీ ప్రసంగాలను గాడిచర్లయే అనువదించార న్నారు. గాడిచర్ల పత్రికారంగంలోకి అడుగుపెట్టి 'స్వరాజ్య' అనే తెలుగు పత్రి కను ప్రారంభించి ఆంగ్ల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టార న్నారు. సంపాదకుడుగా ఆయన ఎన్నో కొత్త పదాలు పుట్టించారని, 'ఎడిటర్' అనే పదానికి 'సంపాదకులు' అనే పేరు పెట్టింది ఆయనే అని అన్నారు. ఆయన ది నేషనలిస్ట్, మాతృసేవ, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త లాంటి పత్రికలకు కూడా సంపాదకత్వం వహించారన్నారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాడిచర్ల జైలులో చాలా దుర్భర జీవితాన్ని అనుభవించారన్నారు. కాళోజీ గాడిచర్లను కీర్తిస్తూ చెప్పిన కవితను వినిపించారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు చంద్రశేఖర్, రంగా, వెంకట నగేశ్ పాల్గొన్నారు.